


# తాపీవాళ్ళు

ఆతేటి నాగమణి

అది అడ్డుగోడ.

పేర్చిన యిటుకలు కూలిపోతుండా, ఎప్పటికప్పుడు సిమెంటుతో తాపడం చేస్తున్నారు తాపీవాళ్ళు.

నిమిషాలు, గంటలు, రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు... ఓహో....ఎన్నో ఎన్నో ఆ కాలప్రవాహంలో కలిసి గతంలా మారిపోయి, ఆ గతానికి కొలబద్దగా మిగిలిపోయాయి.

అది ఈనాటి అడ్డుగోడ కాదు.

ఆ గోడ వయసు, చరిత్ర పేర్చబడిన యిటుకలు చెబుతాయి.

ఎన్నో ఘనకార్యాలు చేసింది. మరెన్నో గొప్పపనులు.

ఎన్నో చేసినా ఆ గోడ అలిసిపోలేదు. పాతపడిపోయిందనిపించినా కొత్తరూపం దిద్దుకుంటూ శిథిలంకాకుండా, సిమెంటు తాపడం చేస్తున్న వారివల్ల ఎంతో స్థిరంగా నిలబడి వుంది.

ఏ సుడిగాలి, తుఫాను దాన్ని కూలలేకపోయాయి. కూల్చాలని ప్రయత్నించిన వాళ్ళు పిచ్చివాళ్ళుగా వెలివేయబడ్డారు. అలిసిపోయారు. ఓడిపోయారు. ఎంతో ఎత్తుగా ఎదిగిన ఆ అడ్డుగోడ నీడ వ్యాపించినంత మేర, అందరూ తాపీవాళ్ళే. ఆ నీడ దాకని దాటు వేసుకుంటూ వెళ్ళి తాత్కాలికంగా తప్పించుకున్నా చివరికిఓటమిపాలై నింద మోస్తున్న అభాగ్యులు వున్నారు.

కెరటం ఎంతవేగంగా, ఆవేశంగావచ్చినా సల్లపి కఠిన శిలను తాకి, వెనక్కి తిరిగి పడిపోయినట్టి ఆ అడ్డుగోడను ఢీకొని ఎన్నో జీవితాలు బలై పోయాయి.

ప్రేమ, అభిమానం, మమత, అనురాగం ఆత్మీయత అణచబడ్డాయి ఆ అడ్డుగోడ అడుగున.

అర్థం లేని చాదస్తాలు, పిచ్చి వ్యామోహాలు. పిచ్చినమ్మకాలు. మనిషి ధైర్యాన్ని, స్థిరచిత్తాన్ని సడలించి, అతని బలహీనతల మీద దెబ్బతీసి, తనకు దాసోహం అనేలా చేసుకొని, తను పడిపోకుండా, ఆధారం చేసుకునే శక్తి వుందా గోడకు.

అంతవరకు రాసి, రాసిన దానివంక చూస్తూ, అసంతృప్తిగా నిట్టూర్చాడు శర్మ. ఆవేదనగా నుదుటు రాసుకుంటూ, వాలు కుర్చీలో వెనక్కి వాలాడు. అతని కళ్ళకు ఎదురుగా ఎదురింటి ప్రహరీగోడను సిమెంటుతో తాపడం చేస్తున్నాడు తాపీమేస్త్రి రంగయ్య. ప్రక్కనే రంగయ్య కొడుకు సహాయం చేస్తున్నాడు.

“రాము వచ్చాడా” వంటింటి గుమ్మంలో నిలబడి అడిగిన శాస్త్రి ప్రశ్నకు సుశీలమ్మ తడి చేతులను కొంగుకు తుడుచుకుంటూ తలెత్తి భర్త మొహంలోకి చూస్తూ “ఇంకా ఆడుకోవడానికి వెళ్ళి రాలేదు. ఏం?” అంది భర్త మొహంలో కదలాడే కోపం చూసి, రాము ఏం చేశాడోనని ఆలోచిస్తూ.

“ఏమిటా? నీ సుపుత్రుడేం చేశాడో తెలుసా? ఆ పీరు సాయెబు కొడుకు మస్తాన్ లేడూ! వాడింటికి ఆ మాలవాడు దాసరయ్య కొడుకుతోకలిసివెళ్ళి వాళ్ళింట్లో ఆమాలవాడి ప్రక్కన కూర్చొని, ఏదో పెడితే మెక్కాడట. రానీ వెధవని, కులం, మతం చెరచడానికి పుట్టాడు భ్రష్టుడు. నీ గారాబం వాడ్నింత పాడుచేసింది. అబ్బాయి ఒక్కడే అంటూ నెత్తి నెక్కించుకున్నందుకు కొంపకీకడానికి తయారయాడు” అంటూ కోపంగా వరండాలో పచార్లు చేస్తున్న అవధాని కోపాన్ని, రాముచేసిన పనిని తలుచుకున్న సుశీలమ్మ మనసు తల్లడిల్లిపోయింది.

ఓ అరగంట గడిచేసరికి రామావధాని వచ్చాడు. వరండా మెట్లెక్కకముందే చింతబరికె రాము వీపుమీద వికృతంగా నాట్యం చేసింది. చొక్కా చిరిగిపోయి వీపుమీద వాతలు ఎర్రగా తేలాయి. వేసుకున్న బట్టలు ఊడదీయించి యింటిచుట్టుగా పెరట్లోకి తీసుకొచ్చి నాలుగు చెంబులనీళ్ళు కుమ్మరించాకగాని యింట్లోకి రానీయలేదు.

పిలిచినందుకు నేరంగా పీరుసాయెబును తిట్టాడు. ఫలితంగా మస్తాన్ దెబ్బలు తిన్నాడు.

తన కొడుకు సరసన కూర్చున్న నేరానికి తానే స్వయంగా దాసరయ్య వెంటవచ్చిన తొమ్మిదేళ్ళ కుర్రాణ్ణి గొడ్డును బాదినట్టు బాదాడు అవధాని. అప్పుడుకాని అతని మనసు శాంతించలేదు.

సంఘం గౌరవించే తన కులం కొడుకువల్ల పోతుందనే భయం, అవధానినంత పశువుగా మార్చిందేకాని, కొంచెంకూడా ఆలోచింపనీయలేదు. నాలుగు చెంబుల నీళ్ళతో కొడుకు శుద్ధి అయిపోయాడనే తలచాడేకాని, కడుపులోకి వెళ్ళిన పదార్థం సంగతి మరిచిపోయాడు. అతని భయంలో చెలరేగిన ఆలోచనలు రాము మనసులోకి నూరిపోసి, చివరికి కొన్నాళ్ళకు తన కొడుకనిపించుకునేలా చేశాడు అవధాని. కదిలిన కాలం, రాముని రామావధానిగానే కాదు, అవధాని కొడుకుగా మార్చింది. అంతేకాని ఆలోచించే యింగితాన్ని. తెలివిని యివ్వలేదు.

“నిన్ను నేను ప్రేమిస్తున్నాను పావూ!”

శివరామ్ మాటలకు ఫక్కున నవ్వేసింది పార్వతి.

"ఎందుకు నవ్వుతావ్?" చిరుకోపంగా అడిగాడు.

"నిన్ను చూస్తుంటే దేవదాసు గుర్తొస్తున్నాడు" అంది.

"అంటే-నేను...." శివరామ్ మాట పూర్తికాకముందే అడ్డుకుంది.

"నేను నిన్ను ప్రేమించాను" అనే నీ మాటలో ఏదైనా కొత్తదనం వుందా శివరామ్! నువ్వు చెప్పేవరకు నాకావిషయం తెలీదనా? మన పరిచయం దిద్దుకుంటున్న అందమైన రూపాన్ని నేను అర్థం చేసుకోలేదనా? అరిగిపోయిన రికార్డులా నువ్వు మళ్ళీ మళ్ళీ చెప్పడం" అంది.

"నేనన్నదాంట్లో తప్పేం వుంది?" అన్నాడు.

"తప్పు అనికాదు శివరామ్, ఒకరి ప్రేమను, ఒకరు అర్థం చేసుకొని గుర్తించే మెట్టుదాటి వచ్చేశాం మనం యిప్పుడిక మళ్ళీ సినిమా డైలాగులా చెప్పుకోవడం బావులేదు. కొత్త మాట ఏదైనా చెప్పు" అంది పైట కొసను పంటితో నొక్కిపట్టి లాగుతూ.

"ఊఁ"...అంటూ చిలిపిగా పార్వతి కళ్ళలోకి చూశాడు శివరామ్. ఆమె తెల్లటి చెక్కిళ్ళు, అరుణిమను దాల్చాయి.

"ఓహో"......అంటూనవ్వి, "నామీద నమ్మకంలేదూ?" అన్నాడు.

"మళ్ళీ పాతడైలాగే" అంది చిరాకుగా

"అయితే సరే యిక నీకు డైలాగు లనుకుంటున్న నా జవాబులేం చెప్పను. చేయాల్సింది చేసే చూపెడ్తాను" అన్నాడు. నవ్వింది పార్వతి.

"ఏమిటి? నువ్వు .... ఆ కళావంతుల అమ్మాయి పార్వతిని పెళ్ళి చేసుకుంటావా? నీకేమైనా బుద్ధి వుందిరా? మతి వున్నవాడి మాటలేనా?" నరసింహమూర్తి నిజంగానే ఉగ్రరూపం దాల్చి అడిగాడు.

"నేనా అమ్మాయిని ప్రేమించాను నాన్నా! నన్నూ ఆ అమ్మాయి ప్రేమించింది" ధైర్యంగా చెప్పాడు శివరామ్.

"అఘోరించలేకపోయావు రేయ్ శివా! కళావంతుల అమ్మాయి నిన్ను ప్రేమించడమేమిట్రా? డబ్బుకోసం రోజుకొకరిని ప్రేమించడం వాళ్ళకు అలవాటే" అన్నాడు నరసింహమూర్తి.

"ఆ అమ్మాయి అలాంటిదికాదునాన్నా!" నమ్మమన్నట్టుగా చెప్పాడు శివరామ్.

"శివా! మన వంశం. సంప్రదాయం ఎలాంటివో నీకు బాగా తెలుసు. ఓ కళావంతుల అమ్మాయి ఈ యింటి కోడలిగా వస్తే. మనకులం, పరువు, ప్రతిష్ట పోతాయ్. ఈ సంఘంలో నేను, నువ్వు, తలెత్తుకు తిరగలేం. వెలేస్తుంది. మీకు పుట్టబోయే పిల్లలకు భవిష్యత్తు లేకుండా చేస్తుంది. ఆదర్శం అంటూ వెర్రిగా, ఆ అమ్మాయిని ఉద్ధరించా లనుకుంటున్నావేమో....నీ ఆదర్శమే నీకు బెడిసికొడుతుంది."

"శివా! ఒక్క నిజాన్ని అర్థం చేసుకో? తండ్రిలా కొడుకు, తల్లిలా కూతురు కావడం రివాజు. రాజుకొడుకు రాజే అవుతాడు. వెలయాలి కూతురు వెలయాలే కావడం ధర్మం. నువ్వు మార్చాలన్నా మార్చలేవు. వ్యర్థ ప్రయాసపడితె నీకేం మిగులుతాయో తెలుసా. ఈ సంఘ బహిష్కరణ, వెలివేసే బంధువులు .... భవిష్యత్తులేని జీవితం"— అంటూ. సంఘానికున్న శక్తిగురించి, కులానికి అది యిచ్చే గౌరవం, విలువగురించి కాదని ఎదిరిస్తే మిగిలేదికన్నీళ్ళు, కలతలు, దిగుళ్ళ గురించి భయంగా చెప్పి చివరికి శివరామ్ గుండెల్లో పారు గురించి నిండిన ప్రేమను "హుష్" మనిపించాడు నరసింహమూర్తి.

పదివేల కట్నంతో ఐదెకరాల పొలంతో ఆ యింటి కోడలిగా వచ్చింది గిరిజ.

మనిషిని ప్రేమను వొదులుకో వచ్చు. ప్రాణాలను వొదులుకో వచ్చు. కాని కులాన్ని వొదులుకుంటే సహించి భరించ లేదు సంఘం. దాని చరిత్రలో ఎవ్వరలా చేసి బాగుపడ్డ నిదర్శనాలు లేవు. — ఇది సంఘ సూత్రం — ఈ సూత్రప్రకారం. శివరామ్ పార్వతిని పెళ్ళి చేసుకోలేదు. కళావంతురాలైన తల్లి కడుపున పుట్టిన నేరానికి శిక్షగా పార్వతి కళావంతురాలిగా మిగిలిపోవటం ధర్మం — అంతేకాని ఓ ఇంటికి యిల్లాలిగా ఓ భర్తకు భార్యగా కాకూడదు. అన్న సంఘాన్ని ఎదిరించలేక. దాని వాడి కోరలమధ్య నలిగిపోయి ఓడిపోయింది పార్వతి.

ఇది సంఘ ధర్మం — తరతరాలుగా వస్తున్న రివాజు.

మళ్ళీ ఆగిపోయింది శర్మ కలం.

అతనేదో రాయాలనుకున్నాడు. ఏదో ఆవేదన అతని గుండెనిండా పేరుకుపోవడంతో. ఇక ముందుకు కదలలేనట్టుగా ఆగిపోయింది శర్మ కలం.

"తన ఆదర్శం తనకే బెడిసికొట్టిందా?"

"లేదు...లేదు....తను గడిపిన జీవితం హాయిగానే గడిపాడు. అనుభవించిన జీవితంతో తృప్తిపడ్డాను."

ఆనాడు తానేదో గొప్పపని చేశానని గర్వపడ్డాడు.

తన భుజాలను తానే తట్టుకొని ధైర్యం చెప్పుకున్నాడు.


## ఔత్సాహిక రచయితలకు, రచయిత్రులకు శుభవార్త!

మీ రచనలని పత్రికలు గుర్తించడంలేదా? తిరిగి వచ్చేస్తున్నాయా? నిరుత్సాహ పడకండి: మీ కోసమే 'రచన' (ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రయిటింగ్)ను స్థాపించాం. 'రచన' రచయితలకు ప్రప్రథమ సేవాసంస్థ. కొత్త రచయితలకు కల్పతరువు. కథలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు, కవిత్వం, కార్టూనులు-వివిధ శాఖలను అనుభవజ్ఞులైన సుప్రసిద్ధ పత్రికా రచయితలు నిర్వహిస్తున్నారు. పేరు తెచ్చుకోలేక పోతున్న రచయిత(త్రు)లంతా మా సేవలను వినియోగించుకోవచ్చు. అంతేకాదు..ఇంకా చాలా చాలా కిటుకులు తెలుసుకోవచ్చు. కరస్పాండెన్స్ కోర్సు ద్వారా కథలు వ్రాయడం నేర్పే ప్రప్రథమసంస్థ 'రచన'. వెంటనే సంప్రదించండి. ప్రాస్పెక్టస్‌కి, అప్లికేషన్ ఫారానికి మీ పూర్తి అడ్రసు తెలియపరుస్తూ రూ. 2/-లు మనియార్డరు చేయండి.

మేనేజింగ్ డైరెక్టర్, 'రచన'

# ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రయిటింగ్

హనుమాన్‌పేట,

విజయవాడ-520 003.

కాని .... ఆనాడు తాను చేశాననుకున్న గొప్పపని, సంఘాన్ని ఎదిరించి సాధించాననుకున్న విజయం, ఈనాడు .... ఈనాడు తనకీ ఒంటరితనంతప్ప మరేం మిగిల్చింది?

"ఇది నిజంగా తనకు ఓటమేనా?"

"తాను గెలవలేదూ?"

తాను భ్రమపడ్డాడు. కాలం మారిందనుకున్నాడు. యింకా మారుతుందనుకున్నాడు. బూజుపట్టిన చాదస్తాలను వొదిలి, మకిలి పట్టిన భావాలను మార్చి, సంఘం ఎంతో ఎత్తుగా ఎదుగుతుందనుకున్నాడు.

అందుకే సురేఖపెళ్ళి తనకు సమస్యగా నిలుస్తుందని అనుకోలేదు. అసలు ఊహించలేదు.

"కాని జరిగిందేమిటీ?"

గతం గుర్తుకు రావటంతో శర్మ చేతిలోని కలం జారిపోయింది. బాధగా నిట్టూర్చిన అతని నిట్టూర్పుకు తోడుగా. కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

సంఘం తీర్చుకున్న ప్రతీకారంగా ఆ యింట్లో ఒంటరిగా మిగిలిన అతనికి గడిచిన జీవితం బాధనే తప్ప. మరో భావాన్ని కలిగించలేదు. ఒకనాటి తన ఆవేశం....గుర్తుకు వచ్చింది.

కులం, సంప్రదాయం, వంశం ఇవన్నీ సంఘం నిర్మించినఅడ్డుగోడలు. వాటిని కదల్చలేక, దాటలేక, ఎంతోమందిప్రయత్నించ ఓడిపోయి, బలై పోతుంటే, అవి స్థిరంగా వుండడానికి. మరికొందరు ఆ ధా రం గా నిలుస్తుంటే- ఈ సంఘం మారదు. ప్రగతికి ఆటంకంగా వుండే ఈ సంఘపు ఇనుప సంకెళ్ళను తెంచుకొని, అ డ్డు గో డ లు కూల్చితే కాని ఈ యు వ త రం వా ళ్ల సాధించే ప్రగతికి భావిలేదు. అంటూ ఎంతో ఆవేశంగా చెప్పి. ఆదర్శం నిండిన మనసుతో, మార్గరెట్‌ను పెళ్ళిచేసుకున్నాడు శర్మ ఇరవై యేళ్ళక్రితం.

తల్లి, తండ్రి ఇంట్లోకి రానీయలేదు. పెళ్ళయి అ త్తా రిం టి కి వెళ్ళిన చెల్లెలు, అన్న చేసిన పనికి. పుట్టింటి మొహంచూడకుండా పోయింది.

చెడిపోయాడని, సోమయాజుల కడుపున చెడ బుట్టాడని. హిందూ మతాన్ని, బ్రాహ్మణ్యాన్ని చెడగొట్టాడని సంఘం విమర్శించింది. వెలివేసింది. పిచ్చి కుక్కలా వెంట తరిమింది.

శర్మ భయపడలేదు, మా ర్గ రె ట్ ను వొదులుకోలేదు, ఓడిపోయినా ఓటమిని మరి పోలేదు సంఘం.

గెలిచిన గెలుపు శాశ్వతం అను కున్నాడు శర్మ.

కాలం గడిచిపోయింది, మా ర్గ రె ట్ సురేఖను తనను వొదిలి దూరంగా వెళ్ళిపోయింది. ఇరవై యేళ్ళ గడిచిపోయాయి.

తనతో మొదలైన మార్పు. తనతోనే ఆగిపోయిందనుకోలేదు శర్మ.

అందుకే సురేఖకు పెళ్ళి చేయాలనుకున్నాడు.

కాని, ఒకనాడు ధైర్యంగా సంఘాన్ని ఎదిరించి, పాతుకుపోయిన చాదస్తాన్నీ, వెర్రి నమ్మకాన్నీ సడలించి, సంఘంతో సవాలు చే సి న శర్మ ఈనాడు ఒక తండ్రిగా కూతురు పెళ్ళి చేయలేకపోయాడు.

సురేఖ పెళ్ళి ఒక సమస్యగా మారిపోయింది.

సురేఖ భవిష్యత్తు ఓ ప్రశ్నగా మిగిలిపోయింది.

"తల్లిదో మతం-తండ్రిది మరో మతం. అసలు ఆ పిల్లది ఏ కులం?" అంటూ సురేఖను ప్రేమించానన్న మోహన్‌ను నిలదీశాడు మోహన్ తండ్రి రావు.

అతను ఒక అవధాని, ఒక నరసింహమూర్తి, మరో సోమయాజులే. అంతేకాదు, చ దు వు సంస్కారంతోపాటు, ఈ సంఘాన్ని ఎదిరించే ఆవేశం, శ క్తివున్న యువత – పిరికితనంతో, బలహీనతతో వ్యామోహాలతో ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకునే ధైర్యంలేక, త మ కేం కావాలో తెలిసికూడా ప్రయత్నించి సాధించలేని బలహీనతలతో వెర్రిమొర్రికోర్కెలతో జీవితాలను డబ్బుతో విలువకట్టే స్థితికి దిగజారిపోయింది.

ప్రేమించానన్న మోహన్, తం డ్రి నెదిరించలేక. మరో అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. కాని, ఎంతమంది మోహన్‌లతో, మోహన్‌లాంటి తం డ్రు ల తో నిండిన ఈ సంఘం, సురేఖకు పెళ్ళి చేయలేకపోయింది.

ఇరవై యేళ్ళక్రితం తాను చేసిన ఓ మంచిపనికి సంఘం ఈనాడు విధించిన శిక్ష సురేఖ అనుభవించడం చూసి, శర్మ బాధపడిపోయాడు.

"నాన్నా,కాలంమారిందనడానికి.ఈనాడు మనిషి సాధించిన ప్రగతి నిదర్శనం. దానికి తార్కాణంగా మ ని షి చంద్రలోకానికి వెళ్ళి వచ్చాడు కాని....శాస్త్రరీత్యా మానవ మేధ ఎదిగిందేమో కాని. సాంఘికంగా మనిషి, మనసు, అభిప్రాయాలు. చాదస్తాలు నమ్మకాలు దృక్పథాలు ఎదగలేదు. మారలేదు నాన్నా, సంఘం నిర్మించిన ఈ అడ్డుగోడలను కూల్చేశక్తి ఎదిరించే ధైర్యం ఈ తరంలోకూడా సాధ్యం కాలేదు నాన్నా, అలాంటప్పుడు నాలాంటివాళ్ళు యి లా మిగిలిపోక తప్పదు నాన్నా! ఇది నీ నేరం కాదు నాన్నా? ఇరవై యేళ్ళ క్రితం నువ్వు ఎదిగినా, ఆ నాటికి ఈ నాటికి ఎదగని, ఈ సంఘాన్ని చూసి జాలిపడాలే తప్ప బాధపడకూడదు" అంది సురేఖ.

శర్మ నిర్లిప్తంగా చూశాడు కూతురు వైపు.

"ఈ సంఘం అంతా తాపీవాళ్ళే నాన్నా? తాము నిర్మించిన అడ్డుగోడలు కూలిపోకుండా. ఎప్పటికప్పుడు తాపడం చేస్తున్న వీళ్ళు నా పెళ్ళి జరగనివ్వరు. వయసు వచ్చిన ఓ ఆడపిల్ల పెళ్ళి కాకుండా, ఈ సంఘంలో బ్రతకడం వీళ్ళు భరించలేరు నాన్నా!" అంటూ తనకు తానుగా దూరంగా వెళ్ళిపోయింది సురేఖ.

"రేయ్-ఎదవ నన్నాసి...కాస్తసిమెంటు ఎక్కువ కలపాలని తెలీదు. జోరుగా వానొచ్చిందంటే కూలిపోతాది గోడ....సిమెంటు పాలెక్కువ కలుపు!ఎట్టా బతుకుతావురా?" అంటూ అరిచిన రంగయ్య కేకలకు ఉలిక్కిపడుతూ చూశాడు శర్మ.

"చూడండయ్యగారూ! వీడికి యేళ్ళు వచ్చాయేకాని తెలివి రాలేదు. మా తాత, మా అయ్య తాపీమేస్త్రీలుగా పోయారు. వీడ్నికూడా ఓ మంచి తాపీమేస్త్రీని చేయాలనే నా బాధ. ఈడికసలు ఆ ధ్యాసేలేదు" అన్నాడు శర్మవంక చూస్తూ రంగయ్య.

పద్దెనిమిదేళ్ళ రంగయ్య కొడుకు తట్టలో ఇసుక, సిమెంటు కలిపి అందిస్తున్నాడు.

రంగయ్య మాటలకు జవాబు చెప్పలేదు శర్మ.

అతడికి తెలుసు....రంగయ్య తనలాగే తన కొడుకును తాపీ మేస్త్రీని చే యా ల నుకుంటాడేకాని, చదువుకొని, పెద్ద ఉద్యోగం ఏదో చేయాలని అనుకోడు. అది రివాజు కాదు కాబట్టి.

"రేయ్...యిలా....యిలా ముందుగా సిమెంటు ముద్దను యిలా అం టిం చి" అంటూ, పని నేర్పుతున్న రంగయ్యవంక, ఇష్టం లేకున్నా చేస్తున్న ఆ కుర్రాడివంక వెర్రిగా అర్థం కాకుండా చూస్తుండిపోయాడు శర్మ.

మరో నాలుగు రోజులు గడిచేసరికి. రంగయ్యలాగే, అతని కొడుకు, తాపీపని చేయటం బాగా నేర్చుకున్నాడు. రేపోమాపో అతను తాపీ మేస్త్రి అయిపోతాడు—అన్న నిజం అర్థంచేసుకున్న శర్మ వేదాంతిగా నవ్వుతున్నాడు.

సంఘానికి ప్రతిరూపంగా నిలిచిన ఆ అడ్డుగోడ....ఎంత పెద్ద వర్షం వచ్చినా కూలిపోకుండా, సిమెంటు తాపడం చేస్తున్న ఆ తండ్రీ కొడుకుల్లో...ఎంతో మంది .... కదిలి, కనిపించారు శర్మకు. ★